క్లుప్తంగా

రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి

- కాళేశ్వరం లేకున్న 150మెట్రిక్ టన్నుల ధాన్యం
- ఎమ్మెల్యే గడ్డం వివేక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: కాళేశ్వరం ప్రాజెక్ట్ లేకున్న రాష్ట్ర చరిత్రలో రికార్డు స్థాయిలో 150మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వచ్చిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా పండితులు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పంచాంగ శ్రవణం చేసిన పండితులు జక్కెపల్లి నాగేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఉగాది పచ్చడి, అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



నెన్నెల: ముస్లింలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి హిందూ, ముస్లింల ఐక్యతకు రంజాన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఉపవాసాలు, నమాజ్‌లతో ఆధ్యాత్మిక శోభ నెల రోజుల పాటు వెల్లివిరిసిందన్నారు. ప్రతి ఒక్కరూ సంతోష వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రామనామస్మరణతో మార్మోగిన గూడెం



మాలధారణకు హాజరైన భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణాలు ఆదివారం రామనామస్మరణతో మార్మోగాయి. సత్యదేవుని ఆలయ సమీపంలో గల శ్రీ హనుమాన్ ఆలయంలో 950మంది భక్తులు హనుమాన్ దీక్షా మాలధారణ చేసుకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు కాషాయ వర్ణంగా మారిపోవడమే కాకుండా, భక్తుల రామనామస్మరణతో హోరెత్తాయి.

స్పెషల్ కేటగిరిలో ఇద్దరు విద్యార్థులు ఎంపిక

జన్నారం: సాంఘిక సంక్షేమ, మైనారిటీ పాఠశాలలో చేరడానికి ఎంపిక చేసిన జాబితాను సంబంధిత అధికారులు విడుదల చేశారు. ఫలితాల్లో స్పెషల్ కేటగిరీ కింద మండలంలోని అక్కపెల్లిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇంగ్లిష్ మీడియంకు చెందిన 4వ తరగతి విద్యార్థులు ముత్యం నిహాల్ వర్మ రాష్ట్ర స్థాయిలో 504ర్యాంకు సాధించగా, జహాన్ ఖాన్ 1642ర్యాంకు సాధించి గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఎంఈవో విజయకుమార్, ఉపాధ్యాయులు కరుణ, మౌనిక అభినందించారు.

శ్రామికవర్గాల సంస్కృతిని ఆచరించాలి

పాతమంచిర్యాల: మహాత్మాజ్యోతి భాపూలే అందించిన శ్రామికవర్గాల సంస్కృతిని ప్రజలు ఆచరించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో పూలే ఉగాది సంబురాలు జరుపుకున్నారు. బహుజన వర్గాల శ్రమతోనే మానవ మనుగడ కొనసాగుతుందని పలువురు వక్తలు తెలిపారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో మాజీ కౌన్సిలర్ హరికృష్ణ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐదో వార్డు మోమిన్‌పుర మసీదు ఖాయరునిసాలో ఆదివారం ముస్లింలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ విందును 5వ వార్డు మాజీ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఏర్పాటు చేశారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలను తినిపించారు.



జన్నారం: పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పచ్చడి పంపిణీ చేస్తూ...



బెల్లంపల్లి: పంచాంగాలతో వేద పండితులు, భక్తులు



భీమారం: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు



చెన్నూర్‌రూరల్: మహమ్మాయి అమ్మవారికి పూజలు



భీమారం: దుక్కి దున్నుతున్న రైతు రాజేశ్వర్‌రెడ్డి



చెన్నూర్‌రూరల్: వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతు



మందమర్రిరూరల్: పచ్చడి పంపిణీ చేస్తూ..



నెన్నెల: పనిముట్లకు విశ్వబ్రాహ్మణుల పూజలు

ఘనంగా ఉగాది

- విశ్వావసునామ సంవత్సరానికి స్వాగతం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- అరక కట్టి పనులు ప్రారంభించిన రైతులు

భీమారం/మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లి/నెన్నెల/భీమిని/జన్నారం/చెన్నూర్/లక్సెట్టిపేట/కోటపల్లి/జైపూర్/తాండూర్/వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలఅర్బన్ /దండేపల్లి: జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఉగాది సంబురాలను ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించుకున్నారు. విశ్వావసునామ సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అందంగా అలంకరించారు. షడ్రుచులతో పచ్చడి చేసి రుచి చూడగా, నేతితో బూరెలు చేసి ఆరగించారు. తెల్లవారు జామున మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేసి రాశిఫలాల వల్ల కలిగే ప్రయోజనాలను, భవిష్యత్ కాలమాన పరిస్థితులను భక్తులకు వివరించారు. కొందరు తెలుగు కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని శుభకార్యాలకు శ్రీకారం చుట్టగా, రైతులు అరక కట్టి సాగుబాట పట్టారు. పంటలు బాగా పండాలని వేడుకున్నారు. విశ్వబ్రాహ్మణులు పనిముట్లకు, మహమ్మాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయ నాయకులు ఆయా పార్టీ కార్యాలయాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. పలుచోట్ల షడ్రుచుల పచ్చడి తయారు చేయించి పంపిణీ చేశారు.



మంచిర్యాలఅర్బన్: పంచాంగ శ్రవణం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



దండేపల్లి: రామాలయంలో పంచాంగ శ్రవణం



మంచిర్యాలఅర్బన్: ఎస్సీ బాలికల వసతి గృహంలో



జైపూర్: శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



లక్సెట్టిపేట: పంచాంగ శ్రవణం చేస్తున్న పూజారి



భీమిని: కన్నెపల్లి ఆలయంలో పంచాంగ శ్రవణం



చెన్నూర్ అయ్యప్పస్వామి ఆలయంలో...



గుడిపేట గోవింద క్షేత్రంలో...

పర్యాటకంపై పట్టింపేది?



నీటితో కళకళలాడుతున్న పోచమ్మ చెరువు

- బెల్లంపల్లి పట్టణంలో ఆహ్లాదం కరువు
- పోచమ్మ చెరువును అభివృద్ధి చేయాలని వేడుకోలు
- మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దితే ప్రయోజనం

బెల్లంపల్లి: ఏళ్ల చరిత్ర కలిగిన బెల్లంపల్లిలో ప్రజలకు ఆట విడుపు, ఆహ్లాదం కరువైంది. వేసవి కాలంలో పిల్లలతో కలిసి కుటుంబ సమేతంగా కొద్దిగంటలు సేదతీరే అవకాశాలు కానరాకుండా ఉన్నాయి. సింగరేణి అవసరాల కోసం నిర్మించిన పోచమ్మచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడానికి రూ.1కోటికి పైగా వ్యయం చేసి కొంతమొత్తంగా పనులు చేశారు. కానీ ట్యాంక్‌బండ్‌గా రూపం దాల్చలేదు. చెరువు కట్టను బలోపేతం చేసి, బతుకమ్మ ఘాట్‌లను నిర్మించి, కొద్ది మొత్తంగా పూడిక తీయించి మమ అనిపించారనే విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో మరిన్ని నిధులు వెచ్చించి తగిన సౌకర్యాలు కల్పిస్తే ఎంతగానో ఉపయుక్తంగా ఉండేది. అలాంటి పనులేమీ చేపట్టకపోవడంతో ప్రజల ఆశలన్నీ ఆవిరయ్యాయి.

అవకాశాలు ఉన్నా..అశ్రద్ధ..

మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పడటానికి, ఆట విడుపు, ఆహ్లాదాన్ని కలిగించడానికి పోచమ్మచెరువుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పోచమ్మ పెద్ద చెరువుకు అనుబంధంగా రెండు చిన్న చెరువులు ఉన్నాయి. ఏ కాలంలోనైన చెరువులో నీటిమట్టం పడిపోవడానికి అవకాశాలు లేవు. ఇప్పటివరకు అలా ఎన్నడూ జరిగిన సంఘటనలు లేవు. చెరువులో బోట్ షికారు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఆట విడుపు కలుగుతుంది. సెలవు దినాలు, ఆదివారాల్లో ఇంటిల్లిపాది వచ్చి ఆహ్లాదంగా గడపడానికి వీలు కలుగుతుంది. చెరువు మధ్యలో ఎత్తైన గుట్ట ఉంది. ఆ గుట్టపై హోటల్, విశ్రాంతి గది, ఇతర సౌకర్యవంతమైన నిర్మాణాలు చేపడితే మరో ప్రాంతానికి వెళ్లే అవసరం ఉండదు. చెరువును ఆనుకొని మైదానం ఉంది. చుట్టూరా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తే రాత్రి 10గంటల వరకు చిరు వ్యాపారాలు, పిల్లల ఆట వస్తువులు అమ్మకం, కొనుగోళ్లు చేయడానికి సదావకాశాలు ఏర్పడుతాయి. ఏఆర్ హెడ్ క్వార్టర్‌కు వెళ్లే మార్గంలో సేదతీరడానికి కుర్చీలు, బెంచీలు ఉన్నాయి. ఎంతమంది వచ్చినా సౌకర్యాలకు కొదువ లేకుండా ఉన్నా.. నిర్లక్ష్యం వల్ల నెరవేరడం లేదు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే...

పోచమ్మ చెరువుకు ఆధునిక హంగులు కల్పిస్తే పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుంది. బొగ్గుగనులు మూతపడి కళావిహీనంగా తయారైన బెల్లంపల్లి కనీసం పర్యాటక ప్రాంతంగా కొనసాగడానికి అవకాశాలు మెండుగా ఉంటాయి. పోచమ్మచెరువు చుట్టూరా ప్రభుత్వ గురుకులాలు, విద్యాసంస్థలు, కళాశాలలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా కలిగిన బెల్లంపల్లితో పాటు చుట్టుప్రక్క మండలాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి సేద తీరే అవకాశాలు కోకొల్లలుగా ఉండనున్నాయి. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, పర్యాటకశాఖ అధికారులు దృష్టి సారించి ప్రజల ఆశలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా



పోచమ్మ చెరువును అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేయడానికి తగిన ప్రాధాన్యం ఇస్తాను. మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది ఆటవిడుపు క్షేత్రంగా మార్చడానికి కృషి చేస్తాను. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి ప్రజల ఆశలకు అనుగుణంగా వ్యవహరిస్తాను.

– గడ్డం వినోద్, ఎమ్మెల్యే

సోలార్ ప్లాంట్ ఇన్‌స్టాలేషన్ పనులు ప్రారంభం



పోలీసు హెడ్‌క్వార్టర్ ముందు చేపడుతున్న పనులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సింగరేణి కంపెనీ తరఫున చేపట్టిన సోలార్ ప్లాంట్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం వద్ద నుంచి కంపెనీ లీజుకు తీసుకున్న ప్రతిపాదిత ఖాళీ భూముల్లో యుద్ధ ప్రాతిపదికన ఇన్‌స్టాలేషన్ పనులు కొనసాగుతున్నాయి. పాత శాంతిఖని గని పక్కన, ఆర్మ్‌డ్ రిజర్వుడు(ఏఆర్) పోలీసు హెడ్ క్వార్టర్ ముందు, ఇల్లెందు క్లబ్ ఆవరణలో సోలార్ ప్లాంట్‌లు నిర్మించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం పాత శాంతిఖని గని శివారు ప్రాంతంలో, పోలీసు హెడ్‌క్వార్టర్ ముందు గడిచిన పక్షం రోజుల పైబడి నుంచి ప్లాంట్ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. భూమి చదును పనులను పూర్తి చేశారు. ఈ మేరకు సోలార్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన పరికరాలు, సామగ్రిని తెప్పించి బిగించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిర్మాణ పనులు సాగుతుండగా, ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి వెళ్తున్నారు. బెల్లంపల్లిలో భూగర్భ గనులు మూతపడి, విభాగాలు ఎత్తివేతకు గురైన దశాబ్దంన్నర తర్వాత తిరిగి సింగరేణి ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్‌ల రూపంలో కార్యకలాపాలు జరుగుతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అటెన్షన్ ప్లీజ్.. వంగిన స్తంభం



భీమారం: మండల కేంద్రం నుంచి గొల్లదుబ్బ ప్రాంతంలో వ్యవసాయ రంగానికి సరఫరా చేసే 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. గత సంవత్సరం నుంచి అక్కడే ఉన్న స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా ఉంది. వ్యవసాయ పనుల కోసం వెళ్లే రైతులు ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని స్తంభంతో పాటు తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: శంకర్, విద్యుత్ శాఖ ఏఈ, భీమారం
ఫోన్ నంబర్ : 79818 34896

నత్తనడకన ‘బైపాస్’..!

- మూడేళ్లైనా ముందుకు సాగని రోడ్డు పనులు



అసంపూర్తిగా బైపాస్ రోడ్డు పనులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారిలో భారీ వాహనలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బుద్ధారం క్రాస్ రోడ్డు నుంచి చెన్నూర్ పెద్ద చెరువు కట్ట వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం టీఏఎఫ్‌ఐడీసీ నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్డుతో పాటు సైడ్రేన్స్, కల్వర్టుల నిర్మాణం పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. కొంత వరకు రోడ్డు పనులు, సైడ్రేన్స్, రెండు కల్వర్టులు నిర్మించారు. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు నిర్మాణం కలగానే మారింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అర్ధంతరంగా నిలిచిన బైపాస్ రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణం పూర్తయ్యేందుకు మరో రూ.5.04కోట్లు కావాల్సి ఉంది. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించమని ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరైన తర్వాత వెంటనే బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం.

చల్లని తాగునీటి పంపిణీ ప్రారంభం



మంచిర్యాలటౌన్: ప్రారంభిస్తున్న డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఏబీఏపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో దాతలు నగునూరి శ్రీకాంత్, నగునూరి సాయిలచ్చన్న, ఏబీఏపీ నేషనల్ సీఈవో బేతి తిరుమలరావు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి కళ్యాణిఖని డిస్పెన్సరీ పక్కన గ్రామీణ ప్రాంతాల ఆటోడ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. మండలంలోని మామిడిగట్టు, ఆదిల్‌పేట్, పొన్నారం, చిర్రకుంట, సారంగపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై పట్టణానికి వచ్చిన ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆటోడ్రైవర్లు తెలిపారు.

ఆదివాసీ గిరిజన సంఘం సమావేశం

దండేపల్లి: మండలంలోని రాజుగూడలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా కమిటీ నాయకులు ఎస్కే అబ్దుల్లా హాజరై గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.